క్లుప్తంగా

పవిత్ర వారం.. శిలువతో పాదయాత్ర



ప్రత్తిపాడు: పవిత్ర వారంలో శిలువతో విశ్వాసులు పాదయాత్ర చేపట్టారు. ప్రత్తిపాడు మండలం రావిపాటివారిపాలెం (చినకోండ్రుపాడు) అమలోద్భవిమాత దేవాలయం నుంచి వట్టిచెరుకూరు మండలం కుర్నూతలలోని ఆరోగ్య మాత దేవాలయం వరకు విశ్వాసులు అధిక సంఖ్యలో పాదయాత్ర చేశారు. ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని విశ్వాసులు 40 రోజుల పాటు ఉపవాస దినాలు చేస్తారు. పవిత్రవారం కావడంతో విచారణ గురువులు బాసాని దినేష్, తమనంపల్లి సంతోష్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేసి పాదయాత్రను ప్రారంభించారు. పాదయాత్ర పొడవునా విశ్వాసులు, క్రైస్తవులు క్రీస్తు శిలువను మోస్తూ, ఏసు గేయాలను ఆలపిస్తూ పాదయాత్ర చేశారు. ఆరోగ్యమాత దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకుని, కానుకలు సమర్పించుకున్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు బలసాని పరామర్శ



గుంటూరు రూరల్: పెదనందిపాడు మండలం పాలపర్తి నుంచి చిలకలూరిపేట వెళ్లే రహదారిలో కాకుమాను మండలం అప్పాపురం గ్రామానికి చెందిన కూలీలు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ క్షతగాత్రులను పరామర్శించారు. మంగళవారం గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో బాధితులను కలిసి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం వైద్యులను కలిసి క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై విచారించారు. మెరుగైన చికిత్సను అందించి త్వరితగతిన కోలుకునే విధంగా తగిన ఆరోగ్య చర్యలు చేపట్టాలని వైద్యులను కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన వేంకటాచలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



పాత గుంటూరు: నందివెలుగు రోడ్డు వస్తనగర్‌లో వేంచేసియున్న పద్మావతీ, గోదాదేవి సమేత కామ్యసిద్ధి వేంకటాచలస్వామి దేవస్థానం అధ్యక్షుడు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం ఆలయ అర్చకులు దీవికృష్ణ బాలాజీ, శ్రీనివాసుల లక్ష్మీనరసింహాచార్యులు నిర్వహణలో ఉదయం స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ నైవేద్యాలతో స్వామిరూపాన్ని చిత్రించే తిరుప్పావడ సేవ భక్తులను అలరించింది. విశేషంగా పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వేలాదిమంది భక్తులకు అన్నదానం జరిగింది. కార్యక్రమాలను ఆలయ కార్యదర్శి ఎంవీ శేషగిరిరావు, మద్దినేని నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు పర్యవేక్షించారు.

గాన గంధర్వ ఘంటసాల పద్యకావ్యం ఆవిష్కరణ

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మంగళవారం కవిరత్న డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్ రచించిన గాన గంధర్వ ఘంటసాల పద్యకావ్యం ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. సభకు విశ్రాంత వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గుమ్మా సాంబశివరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్, విశ్రాంత అధికారి మద్దు వెంకటస్వామి పాల్గొని ఘంటసాల పద్యకావ్యాన్ని ఆవిష్కరించారు. గాయకులు తాళ్లూరి సుధీర్, గాయత్రీ పలు సినీ గీతాలను ఆలపించారు. విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ వి.సింగారావు పాల్గొన్నారు.

28 వరకు లేపాక్షిలో థిమేటిక్ ఎగ్జిబిషన్

పాత గుంటూరు: బ్రాడీపేటలోని లేపాక్షి హస్తకళ ఎంపోరియంలో నిర్వహిస్తున్న థిమేటిక్ ఎగ్జిబిషన్‌లో చేతివృత్తుల వారు తయారుచేసిన వస్తువులను రాయితీలపై విక్రయిస్తున్నట్లు మేనేజర్ ఎంవీఎస్ కుమార్ తెలిపారు. ఎగ్జిబిషన్‌లో కొండపల్లి బొమ్మలు, టి.కొప్పాక బొమ్మ లు, లెదర్ వస్తువులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 28వరకు ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని నగర ప్రజలు లేపాక్షిని సందర్శించాలని కోరారు.

సంక్షేమ ప్రదాతను మళ్లీ సీఎంను చేసుకుందాం

- టీడీపీ నేతల దృష్టిలో వలంటీర్లు జిహాదీ టెర్రరిస్టులా
- ఫ్యాన్ గుర్తుకు ఓటేద్దాం.. సంక్షేమ రాజ్యాన్ని స్థాపిద్దాం
- వైఎస్సార్ సీపీ పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణ
- మండుటెండలోనూ అడుగడుగునా ప్రజల బ్రహ్మరథం



ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: సంక్షేమ పథకాలసారథి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకుందామని పొన్నూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. పెదకాకానిలో మంగళవారం శివాలయం, చర్చి, మసీదుల్లో పూజలు, ప్రార్థనలు చేసి, ఎన్నికల ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమ ప్రభుత్వం కావాలంటే, సంక్షేమ పథకాలు అమలు జరగాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రతి గడపకూ వెళ్లి అమలు అవుతున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని తెలియజేసి, ఓటు అడుగుతున్న పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమేనన్నారు. 2014 ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చిన టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన.. తరువాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని అంబటి విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోను గౌరవిస్తూ ప్రతి హామీని నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. రాజకీయాల్లోకి రాకముందే సీఎం వైఎస్ జగన్‌ను ఆదర్శంగా తీసుకుని భజరంగ్ ఫౌండేషన్‌ను స్థాపించి, ఉచితంగా వైద్య సేవలు అందించానని వివరించారు. జగన్నామ సంక్షేమ సంగమం పేరుతో వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. కంటి వైద్య పరీక్షలు, కళ్లజోళ్ల పంపిణీ, గుండె పరీక్షలు, శస్త్ర చికిత్సలు చేయించానని చెప్పారు. ప్రాణం ఉన్నంత వరకూ నీతికర పరిపాలన అమలు చేయడంతో పాటు ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గర్వించేలా పని చేస్తానని అంబటి మాటిచ్చారు. మండుటెండల్లోనూ ప్రజలు అంబటి మురళీకృష్ణకు బ్రహ్మరథం పట్టారు. ప్రచారం గ్రామంలోని శివాలయం ఏరియా, పాతూరు ముస్లిం కాలనీ,



స్థానికులతో మమేకమై.. సమస్యలు విన్న అంబటి మురళీకృష్ణ

దూదేకులకాలనీ, పుష్పరాజ్ కాలనీ, ఎస్టీకాలనీ, జాన్‌హాస్పరస్ కాలనీ, అంబేద్కర్ నగర్, జ్యోతి నగర్, పాత ఎంఆర్‌ఓ ఆఫీసురోడ్డు, వడ్డెరకాలనీ, ఎన్‌టిఆర్‌కాలనీ, స్వర్ణపురి కాలనీల్లో సాగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, గ్రామ సర్పంచి గోళ్ళ స్వరూపరాణి, ఎంపీటీసీ సభ్యులు షేక్ గుల్జార్, షేక్ షహనాజ్, మాతంగి నిర్మల, వుయ్యూరు సతీష్‌రెడ్డి, కామినేని శ్రీనివాసరావు, అమ్మిశెట్టి శివశంకరరావు, గంగవరపు మల్లేశ్వరరావు, ఆలపాటి రాఘవ, బండెల ఉదయ్‌శంకర్, కొంకిరామారావు, మురికిపూడి చంద్రశేఖర్, భీమవరపు విజయలక్ష్మి, భీమవరపు కోటిరెడ్డి, చాగంటి మురళి మోహన్‌రెడ్డి, ముడియాల మల్లికార్జునరెడ్డి, సయ్యద్ సుబాని, సుంకర నర్సిరెడ్డి, వీర్ల వీరాంజనేయులు బండ్లమూడి బానుకిరణ్, తాడిబోయిన వేణు, దానబోయిన నాగేశ్వరావు, ఆలా ప్రసాద్, పెనుమాల అరుణ్ కుమార్, శివాబత్తుని దయానంద్, పెరుమాళ్ళ అనిల్‌కుమార్, పలువురు వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు.. చర్యలు తీసుకోవాలి

వలంటీర్లు జిహాదీ టెర్రరిస్టులు అంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ నేత బొజ్జల సుధీర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని అంబటి మురళీకృష్ణ కోరారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్లను టెర్రరిస్టులతో పోల్చడం దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. అనంతరం ఆయన పెదకాకానిలో శివాలయం, చర్చి, మసీదుల్లో పూజలు, ప్రార్థనలు చేసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.

ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థులకు జాతీయస్థాయి బహుమతులు

గుంటూరు రూరల్: ఏఐ టెక్నాలజీ సాయంతో సరికొత్త మార్గం చూపడంలో తమ కళాశాల విద్యార్థులు కనబరిచిన ప్రతిభకు జాతీయస్థాయిలో అవార్డు రావడం గర్వకారణమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల చిత్తూరులోని శ్రీ సిటీలో నిర్వహించిన నేషనల్ లెవెల్ హ్యాకథాన్ ప్రొటో టైప్ కంపిటేషన్‌లో ఎన్వీ నీహార్ చౌదరి, జోసెఫ్ ప్రేమ్ నేత్ర దర్శన్ అనే ప్రదర్శనకు ప్రథమ స్థానం లభించటంతోపాటు రూ.25 వేలు నగదు పురస్కారాన్ని అందుకున్నట్లు తెలిపారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తమ కళాశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్యా బోధనకు, పరిశోధనల ప్రోత్సాహకానికి



అవార్డు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

నిదర్శనమని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అంధత్వ సమస్యను పరిష్కరించటానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా అవార్డు పొందిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ జి.రామమోహన్‌బాబు, డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్ అభినందించారు.

హెచ్‌ఐవీపై ఆందోళన చెందవద్దు

- మందులు క్రమం తప్పకుండా వాడితే కట్టడి
- ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ కోగంటి కల్యాణ్ చక్రవర్తి



గుంటూరు మెడికల్: ప్రపంచవ్యాప్తంగా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధి బాధితులపై ఇంకా వివక్ష కొనసాగుతూనే ఉండటం చాలా ఆందోళనకరమైన, బాధాకరమైన విషయమని ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్ట్, హెల్ప్ హాస్పటల్ అధినేత డాక్టర్ కోగంటి కల్యాణ్ చక్రవర్తి చెప్పారు. హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష తొలగించేలా 2030 నాటికల్లా హెచ్‌ఐవీ నిర్మూలనే లక్ష్యంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. మంగళవారం గుంటూరు అరండల్‌పేటలోని హెల్ప్ హాస్పటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 24వరకు కేరళలోని కొచ్చిన్‌లో ఎయిడ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ సదస్సు జరిగిందన్నారు. సదస్సులో పలు దేశాలకు చెందిన హెచ్‌ఐవీ ఎయిడ్స్ చికిత్స నిపుణులు విచ్చేసి తాము కనుగొన్న నూతన చికిత్స విధానాల గురించి వివరించారన్నారు. అన్ డిటెక్టబుల్ (యూ) అన్ ట్రాన్స్‌ఫ్యూజన్ (యూ) అనే నినాదంతో హెచ్‌ఐవీ నియంత్రణే లక్ష్యంగా పని చేస్తున్నట్లు వెల్లడించారు. హెచ్‌ఐవీ వైరస్ వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో కనిపించకపోతే వారి ద్వారా హెచ్‌ఐవీ సోకదనే విషయం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. హెచ్‌ఐవీ వైరస్ కణాల్లో ఉండే జన్యువుల్లో ఉంటుందని, రక్తంలో ఉండదని, తద్వారా ఎయిడ్స్ వ్యాప్తి చెందదన్నారు. హెచ్‌ఐవీ అనుమానం ఉన్నవారు ఆరునెలలపాటు వైద్య పరీక్షల అనంతరం క్రమం తప్పకుండా మందులు వాడి మళ్లీ పరీక్ష చేయించినప్పుడు హెచ్‌ఐవీ వైరస్ పరీక్షలో కనిపించకపోతే వారి ద్వారా హెచ్‌ఐవీ వైరస్ సోకదనే విషయం ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. 95 శాతం హెచ్‌ఐవీ బాధితులను గుర్తించి, 95 శాతం వారు క్రమం తప్పకుండా మందులు వాడడం ద్వారా 95 శాతం హెచ్‌ఐవీ వైరల్ తక్కువగా ఉంటే 2030కల్లా హెచ్‌ఐవీ నిర్మూలన చేయడం సాధ్యమనే విషయాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ సదస్సు ద్వారా వెల్లడించిందన్నారు. హెచ్‌ఐవీ బాధితులు ప్రతిరోజూ మందులు వాడే పనిలేకుండా నెలకు ఒకసారి లేదా, మూడునెలలకొకసారి లేదా, ఆరు నెలలకొకసారి ఇంజక్షన్ చేయించుకోవడం ద్వారా హెచ్‌ఐవీ కట్టడి చేయవచ్చు అన్నారు. ప్రస్తుతం ఈ ఇంజక్షన్లు యూరప్ దేశాల్లో అందుబాటులో ఉన్నాయని, త్వరలోనే ఇండియాకు ఇంజక్షన్లు అందుబాటులోకి వస్తాయన్నారు. హెచ్‌ఐవీ ఉన్నవారిలో సెప్సిస్ ఇన్‌ఫెక్షన్‌ను ఏవిధంగా గుర్తించాలనే విషయంపై జాతీయ సదస్సులో తాను పేపర్ ప్రజెంటేషన్ చేసి మాట్లాడానన్నారు. త్వరితగతిన హెచ్‌ఐవీ బాధితుల్లో సెప్సిస్‌ను గుర్తించడం ద్వారా ప్రాణాలు పోకుండా కాపాడవచ్చనే విషయంపై వివరించానన్నారు. హెచ్‌ఐవీ నిర్మూలన దిశగా ప్రయత్నాలు జరుగుతున్న దృష్ట్యా ప్రజలు బాధితుల పట్ల వివక్షను విడనాడాలని డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి పిలుపునిచ్చారు.

1న ఓపీ విభాగాల్లో కంప్యూటరీకరణ

గుంటూరు మెడికల్: ప్రభుత్వ ఆసుపత్రి ఓపీ విభాగాలన్నింటినీ కంప్యూటరీకరణ చేస్తున్నట్లు గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. మంగళవారం ఆసుపత్రిలోని ఓపీ విభాగాలను ఆయన పరిశీలించారు. ప్రతి ఓపీలోను పుస్తకాల్లో రోగి వివరాలను రాస్తుండటంపై ఆయన ఆరా తీశారు. ఆసుపత్రికి అవసరమైన కంప్యూటర్లు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని ఎందుకు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని సంబంధిత అధికారులను ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలో మొత్తం 28 ఓపీ విభాగాలు పని చేస్తున్నాయని, ఈ విభాగాల్లో ఇప్పటివరకు పుస్తకాల్లోనే పేషంట్ పేరు, అడ్రెస్స్ వంటి వివరాలను నమోదు చేసుకుంటున్నారని దీనివల్ల రోగులకు సేవలు అందడంలో కొంత జాప్యం జరుగుతుందన్నారు. ఇక నుంచి రోగులకు సేవలు అందించే విషయంలో జాప్యం జరగకుండా ఉండేందుకు కంప్యూటర్లను అందుబాటులోకి తీసుకుని



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

రావాలని ఆదేశించారు. పుస్తకాల్లో రాయడం వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారని సమయం వృథా అవుతుందని అందుకని వెంటనే కంప్యూటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఓపీ విభాగంలో పనిచేసే సిబ్బందికి కంప్యూటర్ పై శిక్షణ ఇప్పించాలని చెప్పారు. ఏప్రిల్ 1 నుంచి అన్ని విభాగాలు కంప్యూటరీకరణ చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మెషిన్‌లో భాగంగా పేపర్‌లెస్ హాస్పిటల్‌గా మార్చాలని, ఓపీ మాడ్యూల్‌ని మొదలు పెట్టాలని ఆదేశించారు

సేవకు ప్రతిరూపం సచివాలయ వలంటీరు

ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సంక్షేమ వారధి వలంటీర్ వ్యవస్థ అని, సేవకు ప్రతిరూపం వలంటీర్లు అని ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని వికాస్ నగర్‌లో తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఇటీవల శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను బలసాని తీవ్రంగా ఖండించారు. సుధీర్‌రెడ్డి వలంటీర్లను ఉగ్రవాదులు, తీవ్రవాదులతో పోల్చటం హేయమైన చర్య అన్నారు. టీడీపీ నాయకులు ఓటమి భయంతో ఏమి మాట్లాడుతున్నారో అర్థం కావటంలేదన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందించి ఎందరో ప్రజల ప్రాణాలను కాపాడారన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు వారి ప్రాణాలకు తెగించి సుధీర్‌రెడ్డి ఇంటి కూడా మందులు, సంక్షేమ పథకాలు అందించిన విషయాన్ని మర్చిపోయారా..అని ప్రశ్నించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో టీడీపీ నేతలు రౌడీలను పెంచి పోషిస్తున్నారని, ఓటమి భయంతో వారు దాడులకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. జగనన్న సంక్షేమం, జనరంజకపాలనతో రానున్న ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలవటం ఖాయమన్నారు. ప్రజలంతా రానున్న ఎన్నికల్లో తమ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సహకరించాలని కోరారు.

ప్రజాస్వామ్యం కల్పించిన హక్కు 'ఓటు'



మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు

ప్రత్తిపాడు: ప్రజాస్వామ్యం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎంపీడీవో కె. దుర్గాప్రసాద్ అన్నారు. నైతిక విలువలతో కూడిన ఓటింగ్ వైపు పయనించేలా ఓటర్లను చైతన్య పరిచేందుకు మంగళవారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం స్థానిక కార్యాలయం నుంచి అంకమ్మగుడి మీదుగా పాతమల్లాయపాలెం సెంటరు వరకు ర్యాలీ నిర్వహించారు. తదనంతరం మానవహారంగా ఏర్పడి ఓటు ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం సురేష్, ఆర్ఐ సాహితి, ఈవోపీఆర్డీ మోషె, కార్యదర్శులు నాగిరెడ్డి, జాన్‌పీరా, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

టీడీపీ సభలకు జనమేరి..

- పాతికేళ్ల పాలనకు కరువైన ప్రజాస్పందన
- సభలో వేళ్లపై లెక్కించే విధంగా జనం

పొన్నూరు: నియోజకవర్గంలో టీడీపీకి ఎదురీత తప్పడం లేదు. గతంలో పాతికేళ్లు పాలన సాగించిన ఆ పార్టీ నేడు ప్రజాదరణ కరువైంది. ప్రస్తుతం ఎన్నికల సమయంలో ప్రజల్లోకి వెళుతున్న తరుణంలో ఊహించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదు. పొన్నూరు పట్టణంలో గట్టి పట్టుందని భావించిన టీడీపీ సభలు, ప్రచారం ద్వారా తమ హయాంలో చేసిన అభివృద్ధిని చెప్పుకోలేక, ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకోవడంతో టీడీపీ మాటలు వినేందుకు ప్రజలు ముందుకు రావడం లేదు. టీడీపీ నిర్వహించే సభలకు ప్రజా స్పందన ఆశించిన స్థాయిలో లభించడం లేదు..

- మంగళవారం పట్టణంలోని 4, 5, 20, 21 వార్డులకు సంబంధించి ముస్లిం మైనారిటీలు, స్థానిక ప్రజలతో ఆత్మీయ సభ నిర్వహించారు. సభలో వేళ్లపై లెక్కపెట్టగలిగిన ప్రజలు పాల్గొన్నారు. నాలుగు వార్డుల్లో మొత్తం 10 వేలకు పైగా జనాభా ఉన్నా సభకు అతి తక్కువ మంది రావడాన్ని నాయకులు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు. సామాన్య ప్రజల కన్నా నాయకులు, కార్యకర్తలే సభా ప్రాంగణంలో ఆశీనులైఉన్నారు. పాతికేళ్ల టీడీపీ పాలనకు లభిస్తున్న ప్రజా స్పందనపై పట్టణ ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. సోమవారం 25, 26, 27, 28, 29 వార్డులకు సంబంధించి ఇటుకంపాడు రోడ్డులో జరిగిన సభలో కూడా ప్రజాభిమానం టీడీపీకి కరువైంది. ఇటీవల 16 వార్డులో నిర్వహించిన ప్రచారంలో 5 సార్లు ఎమ్మెల్యేగా పనిచేసి తమ ప్రాంతంలో రోడ్లు వేయకుండా ఇబ్బందులు గురిచేసి ఓట్లడగడానికి వస్తారా అని ఓ మహిళ ప్రశ్నించిన ఘటన టీడీపీ నాయకులకు ఎదురైంది. ఇలాంటి ఘటనలతో టీడీపీ ముందుకు సాగుతోంది.

భక్తిశ్రద్ధలతో సహస్ర దీపాలంకరణ సేవ

పాత గుంటూరు: ఆర్.అగ్రహారం వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 28వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం సుప్రభాత సేవ, నిత్యార్చన, నిత్య హోమం, విశేష హోమం, బలిహరణం తదితర కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. సాయంత్రం ఆరాధన, సహస్ర దీపాలంకరణ సేవలో భక్తులు భక్తి ప్రపత్తులతో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యదర్శులు పాతకోట బ్రాహ్మణయ్య నాయుడు, దాసరి భాస్కరరావు తదితరులు పర్యవేక్షించారు.

ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

నగర కమిషనర్, ఈస్ట్ ఆర్వో కీర్తి చేకూరి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన నగర కమిషనర్, ఈస్ట్ ఆర్వో కీర్తి చేకూరి

నెహ్రూనగర్: రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు ర్యాలీలు, ఇంటింటి ప్రచారాలు చేయాలంటే తప్పనిసరిగా 48 గంటల ముందే దరఖాస్తు చేసుకుని, అనుమతి పొందాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో, పశ్చిమ నియోజకవర్గ ఆర్వో, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మితో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ ప్రచార ర్యాలీలు, ఇంటింటి ప్రచారాలు చేపట్టడానికి 48 గంటల ముందే రిటర్నింగ్ అధికారి నుంచి తగిన అనుమతులు పొందాలని, అందుకు తగిన విధంగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు వేరువేరుగా సింగిల్ విండో కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, లౌడ్ స్పీకర్ల వినియోగం, బోర్డులు, బ్యానర్లు, తాత్కాలిక పార్టీ కార్యాలయాల ప్రారంభం తదితర అంశాలకు సంబంధించి రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి పొందాలన్నారు. అభ్యర్థులు ప్రచురించే కరపత్రాలను ముందుగా జిల్లా ఎన్నికల అధికారి అనుమతితో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సరిపై చేసిన తదుపరి మాత్రమే పంపిణీ చేసుకోవాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై ఏ విధమైన రాజకీయ పార్టీల ప్రచారాలు చేయడానికి వీలులేదని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న కమర్షియల్ స్థలాల్లో కూడా రాజకీయ పార్టీల ప్రచార బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేయడానికి వీలు లేదని ఎన్నికల సంఘం ఆదేశాలను పాటించాలని సూచించారు. నగరంలోని ప్రైవేట్ హోర్డింగ్స్, బోర్డులను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సమాన ప్రాతిపదికగా కేటాయించడానికి సిటీ ప్లానర్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, తదుపరి జిల్లా ఎన్నికల అధికారి అనుమతి మేరకు కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించిన రాజకీయ పార్టీలకు కేటాయింపులు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఆర్‌ఓలు ప్రదీప్ కుమార్, వెంకట లక్ష్మీ, సునీల్, మేనేజర్ ప్రసాద్, సూపరింటెండెంట్ పద్మ, ఎంసీసీ, ఎక్స్‌పెండీచర్ టీంలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలు చేయాలి..

సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని, ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలు అత్యంత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ చాంబర్ లో ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఫ్లైయింగ్ స్క్వాడ్ బందాలు తమకు కేటాయించిన విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సీ విజిల్ యాప్ లో అందే ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లోను నిర్దేశిత సమయంలో హాజరై పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పటిష్టంగా అమలు చేయాలని, నిబంధనలు పాటించని రాజకీయ పార్టీల అభ్యర్థులపై కేసులు నమోదు చేయాలన్నారు. బృందం పరిధిలో అనుమతి లేకుండా ప్రచారాలు, ర్యాలీలు చేసినా, అనధికార నగదు తరలించినా వెంటనే కేసులు నమోదు చేయలని, బృందంలో పోలీసు సిబ్బంది మరింత బాధ్యతగా విధుల్లో ఉండాలని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అతిక్రమించిన వారు ఎవరైనా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్దేశిత సెక్షన్ల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ బందాలు ఎక్స్పెండీచర్ టీంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో అక్రమాలను అడ్డుకోవడంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ ముందుండాలని, క్షేత్ర స్థాయిలో ఏ సమస్య ఎదురైనా తక్షణం తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమావేశంలో సెక్టోరల్ అధికారి శ్రీధర్, ఏఆర్‌ఓలు సునీల్, భీమరాజు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ నాగేంద్ర కుమార్, ఎకో ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలు పాల్గొన్నారు.

బిల్డింగ్‌పై నుంచి పడి బాలిక మృతి

మరొకరికి గాయాలు

గుంటూరు రూరల్: హోలీ ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ బిల్డింగ్ రెండవ ఫ్లోర్‌నుంచి కిందపడి బాలిక మృతి చెందగా మరొక బాలుడు తీవ్రగాయాలపాలైన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకంది. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గోరంట్ల గ్రామానికి చెందిన వీరపనేని చన్నయ్యకు ఒక కుమార్తె కుమారుడు ఉన్నారు. మంగళవారం హోలీ పండుగ కావటంతో కొడుకు, కుమార్తె వారి స్నేహితులతో కలిసి గోరంట్ల వెంకటేశ్వర కాలనీలోని తమ ఇంటిలో రెండవ ఫ్లోర్‌లో హోలీ ఆడుకుంటున్నారు. అయితే ప్రమాదవశాత్తూ కుమార్తె అలేఖ్యలక్ష్మి(18), కుమారుడు అజయ్ చంద్రమణికంఠలు బిల్డింగ్‌పై నుంచి కిందపడ్డారు. ప్రమాదంలో అలేఖ్యలక్ష్మి తలకు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, మణికంఠకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు గమనించి మణికంఠను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు. మృతురాలు అలేఖ్య మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.